క్లుప్తంగా

దుర్గమ్మకు పూజలు



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలోని బ్రహ్మంగారి మఠం లేఅవుట్‌లో దుర్గమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి 108 కలశాలను మహిళలు పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు గావించారు.

ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం జాతీయ రహదారిపై ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు చేశారు. రాత్రి పల్లకిసేవ జరిగింది. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు మోపూరు కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకుడు కృష్ణమాచార్యులు పూజలు చేశారు.

పొదలకూరులో పద్మశాలి సంఘీయుల సమావేశం రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : పొదలకూరులోని అంబేడ్కర్ భవనంలో పద్మశాలి సంఘీయుల జిల్లా సమావేశం ఆదివారం జరుగనుందని సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపాల్, గౌరవాధ్యక్షుడు నందం అశ్వత్థామ తెలిపారు. శోధన్ నగర్‌లో శుక్రవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పద్మశాలి సంఘీయుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బూదాటి రాధయ్య, డాక్టర్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆందోళన



నెల్లూరు సిటీ : ఆమంచర్ల గ్రామంలో 30 ఏళ్లగా ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి తరగతుల విలీన ప్రక్రియను నిలిపివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి 3, 4, 5 తరగతులను కిలోమీటర్ దూరంలోని ఆమంచర్ల గిరిజన కాలనీ పాఠశాలలో కలపడాన్ని అంగీకరించమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, బుజ్జమ్మ, మస్తానమ్మ, లక్ష్మయ్య, దీప, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిద్దాం

నెల్లూరు (టౌన్) : బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిద్దామని ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా తెలిపారు. స్థానిక అనిత థియేటర్ సమావేశ మందిరంలో పీడీఎస్‌యూ విలీన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రగతిశీల విప్లవ విద్యార్థి సంఘాలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కొన్ని తీర్మానాలను ప్రవేశపెట్టారు. అమ్మఒడి పథకాన్ని అమలు చేయాలని, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు సాగర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్, జిల్లా కార్యదర్శి షారూఖ్ పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు భానుప్రకాష్

నెల్లూరు(బారకాసు) : ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కొత్తకోట భానుప్రకాష్ ఎంపికయ్యారు. ఈ క్రమంలో అదనపు కమిషనర్ నందన్ శుక్రవారం తన చాంబర్‌లో భానుప్రకాష్‌ను అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించి నెల్లూరు కార్పొరేషన్ గౌరవాన్ని పెంచాలని ఆకాంక్షించారు.

ఆర్బీకేలకు మంగళం

- రైతు నేస్తాలుగా నాడెంతో సేవలు
- రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ
- తాజాగా రైతు సేవా కేంద్రాలుగా మార్పు
- సేవలూ అంతంతమాత్రమే

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇలా..	
ఆర్బీకేలు:	89
పనిచేసే ఉద్యోగులు:	89
2022 - 23లో అందిన ఎరువులు:	7,427 మెట్రిక్ టన్నులు



ముత్తుకూరు మండలం దొరువులపాలెంలోని ఆర్బీకే (ఫైల్)

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు నేస్తాలుగా పనిచేశాయి. విత్తనాల మొదలుకొని విక్రయాల వరకు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. అన్నదాతలు పండించిన పంటలను ఈ – క్రాప్ బుకింగ్ ద్వారా గిట్టుబాటు ధరలకు ఆర్బీకేల నుంచి విక్రయించుకునే అవకాశం కల్పించేవారు. ఎరువులు, పురుగు మందులతో పాటు వైఎస్సార్ యంత్రసేవా పథకానికి అర్హులను ఎంపిక చేసి వ్యవసాయ యంత్రాలను అందజేసేవారు. ప్రతి అంశాన్ని ఆర్బీకేల పర్యవేక్షణలో వ్యవసాయాధికారులు నిర్వహించేవారు.

నాడు ఖుషీఖుషీ

ఉన్న ఊళ్లోనే ఆర్బీకేల ద్వారా రైతులు సేవలు పొందేవారు. ఈ – క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికి ఉచిత పంటల బీమా వర్తించేది. పంటలు నష్టానికి గురైన సమయంలో ఎన్యూమరేషన్ నిర్వహించి వీలైనంత త్వరగా అంటే నెల్లోనే రైతులకు పరిహారాన్ని అందజేయడంలో వీటి పాత్ర కీలకంగా ఉండేది. వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వీటి పనితీరును పరిశీలించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన పశుసంవర్ధక, సూక్ష్మసేద్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల్లో రాయితీలను పొందాలనుకునే రైతులు ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్లో నమోదు చేసుకునే అవకాశం ఉండేది. రైతులు పండించే ధాన్యం దళారుల పాలుకాకుండా ఆర్బీకేల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ – క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారి నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను అందజేసే పరిస్థితి ఉండేది.

నేడు దయనీయం

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. సేవలను అంతంతమాత్రంగానే అందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటల బీమా పథకం, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలు అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు రైతు సేవా కేంద్రాల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు యత్నిస్తోందని సమాచారం.



సూరాయపాలెంలో రైతులకు అందజేసిన వ్యవసాయ పరికరాలు (ఫైల్)

పంటల బీమా ఏదీ..?



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంట బీమా సౌకర్యాన్ని గతంలో కల్పించారు. ఇప్పుడు రైతులే నేరుగా పంటల బీమా నగదును ఆన్‌లైన్లో చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. వీటి సంఖ్యను తగ్గిస్తే రైతులు ఇబ్బందులు పడతారు.

– పెంచలరెడ్డి, రైతు, పులికల్లు

సేవలను పెంపొందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలను పెంపొందించాలి. పొలం బడిని నిర్వహించేందుకే సేవా కేంద్రాలను వినియోగిస్తున్నట్లు ఉంది. రైతు సేవా కేంద్రాల సంఖ్యను తగ్గించే యోచనలో ప్రభుత్వం ఉందనే ప్రచారమూ ఉంది. రైతులకు అందించే సేవలను పెంచితే మంచిది.

– రామిరెడ్డి, రైతు, కొనగలూరు

ఉచితంగా లైటింగ్ ఏర్పాటుకు అనుమతివ్వరూ..

పొదలకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి లైటింగ్‌ను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని శ్వేత ఎలక్ట్రికల్స్ యజమాని వెంకటేశ్వర్లునాయుడు కోరారు. ఈ మేరకు దేవస్థాన అర్చకుడు కుమార్‌స్వామికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీలోని వివిధ విభాగాల అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియమించారని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో యూత్‌వింగ్‌కు బట్టా పాల్‌విల్సన్, ఎస్సీ సెల్‌కు బట్టా ప్రవల్లిక, మహిళా వింగ్‌కు షకీలా, బీసీ సెల్‌కు పూచకట్ల పెంచలయ్య, ఎస్టీ సెల్‌కు కల్లూరు వెంకటరమణయ్య, మైనార్టీ సెల్‌కు పఠాన్ రసూర్‌ఖాన్, వీవర్స్‌వింగ్‌కు పొన్నిపాటి కోటేశ్వరరావు, క్రిస్టియన్ మైనార్టీకి చింతల చలపతి, స్టూడెంట్ వింగ్‌కు కల్లు కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్‌కు యమల మోహన్, వాణిజ్య విభాగానికి పిరాట్ల రాజ్‌కుమార్, పబ్లిసిటీ వింగ్‌కు బిట్రగుంట సురేష్, వైఎస్సార్‌టీయూసీకి నల్లబోలు తిరుమలరెడ్డి, లీగల్ సెల్‌కు షమీర్, డాక్టర్స్ వింగ్‌కు భక్తల మోహన్, కల్చరల్‌కు భీమతాటి నరసయ్య, ఐటీ వింగ్‌కు సయ్యద్ ఇలియాజ్, రైతు విభాగానికి కడివేటి శ్రీనివాసులురెడ్డి, వికలాంగ విభాగానికి యస్దాని, మున్సిపల్ విభాగానికి కందుకూరు యానాదిరెడ్డిలను నియమించినట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో టీడీపీపై తీవ్ర వ్యతిరేకత



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: గ్రామాల్లో టీడీపీపై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, అక్రమ కేసులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నేదురుమల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసిన గ్రామస్తులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి సాగిస్తున్న అవినీతి, అక్రమాలపై గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాతో పాటు ఇతర ఎరువులు అందేవని, ఇప్పుడా పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఇదే సీజన్లో పుట్టి ధాన్యం రూ.25 వేలు పలికితే, ఇప్పుడు రూ.18 వేలకు సైతం విక్రయంకావడంలేదని వివరించారు. గతేడాది వరి ఎకరాకు నాలుగు పుట్ల దిగుబడిస్తే, ప్రస్తుతం రెండున్నర పుట్లే దిగుబడవుతోందని చెప్పారు. రైతులు అప్పుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సహజ వనరులను దోచుకోవడం, అవినీతికి పాల్పడటం తప్ప ప్రజాసంక్షేమాన్ని ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గ్రామాల్లో సమస్యలను గాలికొదిలేసి, అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందంటూ ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. సోమిరెడ్డి ధనదాహానికి ఇరిగేషన్ కాలువలు పూడికతో నిండిపోయాయని.. పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. తొలుత పార్టీ గ్రామ నేత లగడపాటి గోపాలనాయుడు కుమారుడు వివాహ వేడుకలకు హాజరయ్యారు. అనంతరం సర్పంచ్ రమేష్‌యాదవ్ తండ్రిని పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు పెంచలనాయుడు, నేతలు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకటశేషయ్య, నావూరుపల్లి, వెలికంటిపాళెం సర్పంచ్‌లు గాలం వెంగయ్య, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి



సమీక్షిస్తున్న మోహన్‌రావు

మనుబోలు: మండలంలోని పలు లేఅవుట్లలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1100 పక్కా గృహాలు పూర్తయ్యాయని, వీటికి అనుసంధానంగా మరుగుదొడ్లను నిర్మించుకోవాలని సూచించారు. మరుగుదొడ్డి బేస్‌మెంట్ స్థాయిలో ఉంటే రూ.ఐదు వేలు, పూర్తయిన వాటికి రూ.12 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. ఇంకుడు గుంతలను తవ్వించాలని చెప్పారు. ఎంపీడీఓ జలజాక్షి, హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పదవులపై మీ సలహాలు అవసరం లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీలో ఎవరికి పదవులు ఇవ్వాలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తెలుసని, దీనిపై సలహాలు ఇచ్చే స్థాయి ఇక్కడి వారికి లేదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత మోచర్ల రామ్‌గోపాల్ మాట్లాడుతూ మినగల్లు గ్రామంలో సర్పంచ్ భర్త రాము స్థాయికి మించి మాట్లాడుతున్నారని, పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు పిడుగు మధుపై రాము అనుచిత వ్యాఖ్యలు తగవన్నారు. సమావేశంలో చింతాల శ్రావణ్‌కుమార్, వార్డు సభ్యుడు తిరమలేష్ పాల్గొన్నారు.

గోదా అమ్మవారికి అభిషేకం

పొదలకూరు: పట్టణంలోని లక్ష్మీ, గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదా అమ్మవారికి అభిషేకాలను శుక్రవారం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు: ఆదూరుపల్లి 132 / 33 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఆరు వరకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు.

ప్రసన్నకు కృతజ్ఞతలు



ప్రసన్నతో లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు

విడవలూరు : వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుడిగా నియమితులైన కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు సిరివెళ్ల కోటయ్య, రఘు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి




కోవూరు : దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైద్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యాధికారి వెంకట చలపతిగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కోవూరు : మండలంలోని పడుగుపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. ఈ మేరకు వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు సీహెచ్‌సీకి తరలించారు.

కబ్జాపై గ్రామస్తుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కోవూరు : టీడీపీ నేతలు ఇష్టారీతిన స్థలాల కబ్జాలకు పాల్పడుతున్నారని మండలంలోని గుమ్మళ్లదిబ్బ కొత్తకాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు తహసీల్దార్ నిర్మలానంద బాబాకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మల్లికార్జున అనే టీడీపీ నేత అక్రమంగా స్థలాలను ఆక్రమిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి



ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో అధికారులు, రైతులు

ఇందుకూరుపేట : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ గురప్ప కోరారు. ఇందుకూరుపేట సహకార బ్యాంకులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులు, మధ్యవర్తుల వద్ద మోసపోవద్దని కోరారు. ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలో 12 కేంద్రాలు, తోటపల్లిగూడూరులో 14, ముత్తుకూరులో 9 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏఓ రఘునాథ్‌రెడ్డి, సహాయకులు దీక్షిత, తిరుమల పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలి



పొదలకూరులో..



మనుబోలులో..

పొదలకూరు: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను ఎదుర్కోవచ్చని సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక డీఎన్నార్ బాలికోన్నత పాఠశాలలో పోషణ్ భీ.. పడాయి భీపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ కావ్యశ్రీ, సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పేర్కొన్నారు. మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, ఆదినారాయణమ్మ, హెచ్‌ఎం రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కొడవలూరు : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు నార్తురాజుపాళెం హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలోని ఎనిమిదో తరగతి చదువుతున్న 16 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ రాత పరీక్ష రాయగా, వీరిలో నాని, అక్షయ, హాస్యశ్రీ, వెంకట సిరి సాత్వికలు ప్రతిభ కనబరచి అర్హత సాధించారు. వీరు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల వంతున ఉపకార వేతనాలు పొందుతారని హెచ్‌ఎం డి.ఓబులేసు తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన విద్యార్థులు, అందుకు కృషి చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిట్టిబాబులను హెచ్‌ఎం శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కలు నాటడం బాధ్యత కావాలి



మొక్కలకు నీరు పడుతున్న విజయభాస్కర్‌రావు తదితరులు

వెంకటాచలం: మానవ మనుగడకు మొక్కలు నాటడం చాలా అవసరమని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. వీఎస్‌యూలో మొక్కలను వర్సిటీ ఎన్నెస్సెస్ విభాగం, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి.. వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కల్లో ఉన్న వివిధ ఔషధ గుణాలను ఆయుర్వేద వైద్యుడు శ్యామ్‌ధన్ వివరించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.